30102024-DIS-04_Layout 1 10/30/2024 3:40 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

యూనిఫారాల పోరుబాట

'మాలోని వాడవే.. మావాడవే నీవు పొట్టకూటికి నేడు పోలీసువైనావు..' అనే చెరబండరాజు ఆత్మీయ అక్షరాలింగనం గుర్తుకువస్తున్నది. క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు బెటాలియన్‌లలో రాజుకుంటున్న అసహనమే అందుకు కారణం. తెలంగాణ స్పెషల్ పోలీసు కానిస్టేబుళ్లు యూనిఫారాలు వేసుకుని నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులూ, పిల్లాపాపలతో గొంతు కలిపారు. రాష్ట్ర చరిత్రలో ఇది అసాధారణమైన ఘటనే. ఇదేదో చెదురుమదురుగా జరిగిందీ కాదు. రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అనేక బెటాలియన్లు నిరసనలతో దద్దరిల్లాయి. ఆందోళనలను అదుపు చేసే పోలీసులే ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? దుర్భరమైన డ్యూటీలు, వెట్టివాకిరీ, ఆపై వేధింపులు, అవమానాలు, కుటుంబాలకు దూరంగా గడపాల్సి రావడం వంటి సమస్యలు వారు ఎదుర్కొంటున్నారు. స్టేషన్ విధులు నిర్వహించే సిబ్బందికి, తమకు మధ్య పని పరిస్థితులు, జీతభత్యాల విషయంలో ఉన్న వ్యత్యాసాలను తొలగించాలని బెటాలియన్ పోలీసులు కోరుతున్నారు. తమిళనాడు తరహాలో ఏక రీతి పోలీసు విధానం అమలు చేయాలనేది వారి ప్రధాన డిమాండ్. మహజర్లు సమర్పించడం సహా తమ ముందున్న అన్ని మార్గాలూ మూసుకుపోయిన తర్వాత మాత్రమే వారు వీధుల్లోకెక్కారన్నది వాస్తవం.

పోలీసుల ఆందోళన ఒక రకంగా రాష్ట్ర పరిస్థితికి అద్దం పడుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాలూ అతలాకుతలం అవుతున్నాయి. మొన్న రైతులు, నిన్న ఉద్యోగార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టడాన్ని చూశాం. పోలీసు వ్యవస్థ అందుకు మినహాయింపు ఏమీ కాదని తాజా పరిణామాలు తెలియజేస్తున్నాయి. ప్రభుత్వం వీటి పట్ల వ్యవహరిస్తున్న తీరులో ప్రధానంగా రెండు అంశాలు కనిపిస్తున్నాయి. ఒకటి, సమస్యలపై దృష్టి నిలపకపోవడం కాగా.. పరిపాలనాపరమైన అపరిపక్వత రెండవది. పోలీసు వ్యవహారాలు చూసే హోం శాఖ సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరే ఉందన్న సంగతి మరువరాదు. బెటాలియన్లు ఏం కోరుకుంటున్నాయనేది ఆయనకు తెలియదా? అసంతృప్తి రగులుతున్న సంగతి పసిగట్టలేకపోయారా? సకాలంలో స్పందించి, వారి న్యాయమైన డిమాండ్లను పరిశీలనకు స్వీకరించి, తగిన పరిష్కారం కనుగొంటే సరిపోయేది. కానీ, భేషజాలకు పోయి బెదిరింపులు, అరెస్టులకు పాల్పడటంతో పోలీసుల్లో ఆగ్రహం పెల్లుబుకుతున్నది. సమస్యను శాంతిభద్రతల అంశంగా చూస్తూ రాష్ట్రాన్ని దిగ్బంధనంలో పెడుతున్న ప్రభుత్వ ధోరణి సర్వత్రా విమర్శల పాలవుతున్నది. ప్రభుత్వ పెద్దల నివాసాల వద్ద ఏర్పాటు చేసిన కంచెల గురించి అనవసరమైన హంగామా చేసిన వారు ట్యాంక్‌బండ్ నుంచి నెక్లెస్ రోడ్డు దాకా పోలీసు వలయం గురించి ఒక్కమాటా మాట్లాడటం లేదు. ఆ వలయాన్ని ఎందుకు ఏర్పాటు చేసినట్టో వారికే తెలియాలి? ఈ నేపథ్యంలో ప్రజలు ఇందిరమ్మ ఎమర్జెన్సీ రోజులను గుర్తుచేసుకోవడంలో వింతేమున్నది.

ఖాకీ యూనిఫారాలు వేసుకునేది మనుషులే. వారికీ కుటుంబాలుంటాయి. తీరుబడి, నిమ్మళం అనేది లేకుండా అహోరాత్రులు పనిచేయడానికి వారు యంత్రాలు కాదు, రోబోలు అసలే కాదు. 'మమ్మల్ని కూడా మనుషులుగా చూడమ'ని వారు అడుగుతున్నారు. 'మనసు పెట్టి మా సమస్యలు ఆలకించండి' అని వేడుకుంటున్నారు. పరిస్థితులు చేయిదాటిపోకముందే ప్రభుత్వం పరిణతితో వ్యవహరించాలి. ఎన్నికలకు ముందు అందరికీ అన్నీ అన్నట్టుగా ఏక్ పోలీస్ విధానం తెస్తామని ఇచ్చిన హామీ అమలుకు చిత్తశుద్ధితో ప్రభుత్వం ముందుకు కదలాలి. పోరుబాట పట్టిన పోలీసుల పట్ల ప్రతీకార ధోరణిని మానుకుని పరిష్కారానికి కృషి చేయడం రాష్ట్రానికి శ్రేయస్కరం.

ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్ కావాలె

ఆర్.కృష్ణయ్య

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు కల్పించాల్సిన రిజర్వేషన్ల శాతాన్ని సమగ్ర అధ్యయనం ద్వారా నిర్ణయించాలి. అందుకు దేశ సర్వోన్నత న్యాయస్థాన రాజ్యాంగ ధర్మాసనం సూచించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం అనివార్యంగా పాటించాలి. అందులో భాగంగా ట్రిపుల్ టెస్టులో మొదటిది అయిన 'ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్'ను నియమించాలి. ఆ కమిషన్ నిర్ధారించిన రాజకీయ వెనుకబాటుతనమే అందుకు ప్రామాణికమైన ప్రాతిపదిక. అయితే, ఇప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ సర్కార్ మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ బీసీలను మరోసారి వంచించేందుకు యత్నిస్తున్నది.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి 2010లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి కె.జి బాలకృష్ణన్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం డాక్టర్ కె.కృష్ణమూర్తి కేసులో ఇచ్చిన తుది తీర్పులో స్పష్టంగా సూచించింది. ప్రధానంగా 2021లో మహారాష్ట్రకు చెందిన వికాస్ కిషన్‌రావు గవళీ కేసులో జస్టిస్ ఖాన్విల్కర్ సారథ్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించడానికి అన్ని రాష్ట్రాలకు ప్రామాణికం. కర్ణాటకకు చెందిన డాక్టర్ కె.కృష్ణమూర్తి కేసులో జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన తీర్పులోని మార్గదర్శకాలను నిర్దిష్టంగా ట్రిపుల్ టెస్టు రూపంలో జస్టిస్ ఖాన్విల్కర్ ధర్మాసనం సూచించింది. 'ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్'ను నియమించడం వాటిలో ప్రధానమైనది. దాంతో పాటు ప్రస్తుత స్థితిగతులకు అనుగుణంగా సమాచారాన్ని సేకరించాలి. రాజకీయ వెనుకబాటుతనాన్ని నిర్దిష్టంగా గుర్తించాలి. క్షేత్రస్థాయిలో ప్రతి గ్రామ పంచాయతీని యూనిట్‌గా తీసుకొని సమగ్ర అధ్యయనం చేయాలి. ఈ మేరకు మార్గదర్శకాల్లోని అంశాలను అన్ని రాష్ట్రాలు తప్పకుండా పాటించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఇందులో డెడికేటెడ్ కమిషన్‌ను ప్రత్యేకంగా రాజ్యాంగంలోని 340 అధికరణం కింద నియమించాలి. ఇందుకు భిన్నంగా అప్పటికే అందుబాటులో ఉన్న బీసీ కమిషన్లకు ఈ బాధ్యతలు ఇవ్వడం కుదరదు. ఎందుకంటే, బీసీ కమిషన్లు ప్రత్యేక చట్టం ద్వారా, నిర్దేశిత పని నిమిత్తం నియమించినవి. విద్య, ఉద్యోగాలకు సంబంధించిన బీసీ కులాల జాబితాల రూపకల్పన, అమలులో ఉన్న రిజర్వేషన్ల సమీక్ష, లోపాలను సరిదిద్ది ప్రభుత్వాలకు సిఫారసులు, నివేదికలను సమర్పించడమే బీసీ కమిషన్ల ప్రధాన విధులు. వాటికి పరిమితులుంటాయి. అందువల్ల బీసీ కమిషన్లను 'డెడికేటెడ్ కమిషన్లు'గా నియమించడం చెల్లుబాటు కాదు. 'ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్' ఏర్పాటుకు సంబంధించి సుప్రీం మార్గదర్శకాలు ఈ మేరకు స్పష్టం చేస్తున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించి, రాజకీయ వెనుకబాటుతనాన్ని నిర్ధారించే దిశగా నిశితంగా అధ్యయనం చేయాలన్నది రాజ్యాంగ ధర్మాసనం ప్రధాన ఉద్దేశం. అలా కాకుండా ఆ లక్ష్యాన్ని నీరుగార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించినప్పుడు.. ఉన్నత న్యాయస్థానాలు తమ విస్పష్టమైన జోక్యంతో ఈ తప్పును సరిదిద్దుతాయి.

తాజాగా మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి బీసీ కమిషన్‌కు 'డెడికేటెడ్ కమిషన్' బాధ్యతలను అప్పగించగా ఉన్నత న్యాయస్థానం దాన్ని తప్పుబట్టింది. ఆ కమిషన్ నివేదికను కొట్టివేసింది. ఈ క్రమంలోనే జయంత్ కుమార్ భాటియా సారథ్యంలో డెడికేటెడ్ కమిషన్‌ను మహారాష్ట్ర ప్రభుత్వం నియమించాల్సి వచ్చింది. ఆ కమిషన్ నివేదిక ఆధారంగా అక్కడ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సాధ్యపడింది. ఇందుకు సంబంధించి వికాస్ కిషన్‌రావు గవళీ (2021), రాహుల్ రమేష్‌వాగ్ (2022) కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పరిశీలిస్తే.. ఉత్పన్నమైన న్యాయపరమైన సమస్యలు, అనంతరం ఆ రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణపై స్పష్టత వస్తుంది. అంతేకాదు, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో ఇలాంటి సమస్యే ఉత్పన్నమైంది. ఇలా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు సుప్రీం మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటిస్తుండగా.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బీసీ కమిషన్‌కు 'డెడికేటెడ్ కమిషన్'గా గుర్తింపునిచ్చింది. దేశంలో ఈ అంశంపై ప్రామాణికమైన తీర్పులు అందుబాటులో ఉన్నప్పటికీ, న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరపకుండానే ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టుగా బోధపడుతున్నది.

ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాలను అత్యంత నిశితంగా అధ్యయనం చేయాల్సిన నేపథ్యంలో ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్ నియామకం సుప్రీం మార్గదర్శకాల్లో మొదటిది, అత్యంత కీలకమైనది. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే జరిగే పరిణామాలు ఏమిటన్నది మన కండ్లముందే కనిపిస్తూనే ఉన్నాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొన్న న్యాయపరమైన సమస్యలే అందుకు సజీవ సాక్ష్యాలు. ఈ నేపథ్యంలో సుప్రీం మార్గదర్శకాలకు భిన్నంగా వ్యవహరిస్తున్న మన రాష్ట్రంలో కూడా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు విఘాతం కలిగే అవకాశముంది.

సుప్రీం మార్గదర్శకాలకు విరుద్ధంగా రాష్ట్ర బీసీ కమిషన్‌ను 'డెడికేటెడ్ కమిషన్'గా ప్రభుత్వం గుర్తింపునివ్వడంపై ఇప్పటికే న్యాయ నిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత బీసీ కమిషన్ ఇచ్చే నివేదిక చెల్లుబాటు అవుతుందో? లేదో? అనే చర్చలు బీసీ వర్గాలను మరింత ఆవేదనకు గురిచేస్తున్నాయి. డెడికేటెడ్ కమిషన్‌గా వ్యవహరిస్తున్న బీసీ కమిషన్ ఈ నెల 28 నుంచి జిల్లాల్లో పర్యటిస్తూ ప్రజాభిప్రాయాన్ని కోరుతున్నది. అయితే, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి కార్యాచరణ చేపట్టబోతున్నదో స్పష్టం చేయకుండానే జిల్లా పర్యటనలు చేపట్టడం విడ్డూరం. కమిషన్ చేసిన కసరత్తు వివరాలను ప్రజల ముందుంచి అభిప్రాయాలను సేకరించడం సముచితంగా ఉంటుంది.

> **రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలపై బీసీ కమిషన్ మొదట సాధికారికంగా, పూర్తిగా అవగాహన ఏర్పరచుకోవాల్సి ఉంది. అంశాలవారీగా సామాజికవేత్తలు, విషయ నిపుణులు, కులసంఘాలు, రాజకీయపక్షాలతో సంప్రదించాలి. రిజర్వేషన్ల శాతం నిర్ణయించడానికి తమ కసరత్తు ఏమిటో స్పష్టంగా వివరించాలి. మెథడాలజీ, రాజకీయ వెనుకబాటుతనం నిర్ధారణ, అవలంబించాల్సిన పద్ధతులపై నిర్మాణాత్మకంగా ఇప్పటికే చర్చించి ఉంటే బాగుండేది. మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించడం సబబు కాదు.**

కమిషన్ కార్యాచరణ అత్యంత శాస్త్రీయంగా, పారదర్శకంగా ఉండాలి. ఇలాంటి కార్యాచరణను పక్కన పెట్టి ప్రజాభిప్రాయ సేకరణకు పర్యటనలు నిర్వహించడం అవగాహనారాహిత్యమే. ఈ అభిప్రాయ సేకరణ వల్ల సమగ్ర సమాచారం అందుబాటులోకి రాదనేది నిర్వివాదం. ఇటీవల తెలంగాణ హైకోర్టు కూడా వికాస్ కిషన్‌రావు గవళీ తీర్పులోని పేరా-13కు అనుగుణంగా మూడు నెలల్లోపు ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పేరా-13లో ఉన్న ట్రిపుల్ టెస్టును నిర్దిష్టంగా పాటించాలని సూచించింది. అంటే డెడికేటెడ్ కమిషన్‌ను నియమించి, అన్ని ప్రక్రియలను పూర్తిచేయాలని దానర్థం. ఆ సందర్భంగా హైకోర్టుకు రాష్ట్ర అడ్వకేట్ జనరల్ రాష్ట్ర ప్రభుత్వం తరపున సమ్మతిని తెలియజేశారు. కానీ, అందుకు భిన్నంగా కార్యాచరణ కొనసాగుతున్నది. ఇది ఇప్పటికే తమ రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిందని ఆవేదనలో ఉన్న బీసీలకు అన్యాయం చేయడమే. ఈ నేపథ్యంలో నిపుణులు, న్యాయకోవిదుల సూచనలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. బీసీలకు న్యాయం చేయాలనుకుంటే, ఇప్పటికైనా జరిగిన తప్పును సరిదిద్దుకోవాలి.

(వ్యాసకర్త: పూర్వ రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు)

బెడిసికొడుతున్న ఫిరాయింపులు

నర్సన్ బద్రి
94401 28169

రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు ముగిసిన ఆరు నెలలకే లోక్‌సభ ఎన్నికలు రావడంతో రాజకీయ నేతల స్థానభ్రంశంపై దాని ప్రభావం ఎంతగానో పడింది. గత పదేండ్ల పాటు బీఆర్ఎస్ అండతో రాజకీయంగా ఎదిగిన వారు వెంటనే ద్రోహచింతనలో పడ్డారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యే దానంతో మొదలైన ఫిరాయింపులు జూలై 15న కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తర్వాత ఆగిపోయాయి.

'బీఆర్ఎస్‌లో కేసీఆర్ కుటుంబం తప్ప, ఎవరూ మిగలరు' అంటూ ప్రతీసారి పలికిన కాంగ్రెస్ నేతల మాటలు నిజం కాలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పేలవమైన ప్రదర్శన, ఫలితాలు, ఎన్నికల హామీల అమల్లో ఆ పార్టీ మాట తప్పడాలు, జాప్యాలు ఫిరాయింపులను పునరాలోచనలో పడేశాయి. వెళ్లిన పది మంది ఎమ్మెల్యేల్లో పోచారం శ్రీనివాసరెడ్డి, అరికెపూడి గాంధీ తప్ప మిగతావారు అనామకంగానే మిగిలిపోయారు. ప్రజల్లో వస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేకతకు వారు బాధ్యతగా సమాధానం చెప్పక తప్పడం లేదు.

బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరడం, జగిత్యాలలో కాంగ్రెస్ నేత ఒకరు హత్యకు గురికావడంతో ఫిరాయింపు ఆ పార్టీలో పెద్ద కుదుపును పుట్టించింది. స్థానిక సీనియర్ నేత, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డిలో మొదలైన నిస్పృహ, ఆక్రోశం తారస్థాయికి చేరుకుంది. ఈ పరిణామాలను తట్టుకోలేని ఆయన కాంగ్రెస్ వ్యవహారాన్ని బహిరంగంగా విమర్శించే పనిలో పడ్డారు. తన ఉనికి ఏమిటో చెప్పాలంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకే పెద్ద లేఖ రాశారు. గాంధీ భవన్‌లో ఈ నెల 26వ తేదీన ఆయన ఒంటరిగా ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి కాంగ్రెస్ ప్రోత్సహిస్తున్న పార్టీ ఫిరాయింపులపై తీవ్ర విమర్శలు చేశారు. నాడు స్పీకర్‌గా ఉన్న పోచారం శ్రీనివాసరెడ్డి వల్లనే అసెంబ్లీలో భట్టి కాంగ్రెస్ తరపున శాసనసభాపక్ష నేత కాలేకపోయారని, అలాంటి వ్యక్తిని పార్టీలోకి ఎలా తీసుకుంటారని నిలదీశారు. ఇలాంటి తప్పుడు పనుల వల్ల పార్టీపై ప్రజలకు గౌరవం తగ్గుతున్నదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ఓడినచోట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకుంటే స్థానికంగా పార్టీ బలహీనపడుతుందని, ప్రభుత్వాన్ని కూల్చుతారని విపక్షాలపై ఆరోపణలు చేస్తూ ఫిరాయింపులను సమర్థించుకోవడం సరికాదని ఆయన మండిపడ్డారు.

> **ప్రెస్‌మీట్ తర్వాత జీవన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో మద్దతు పెరిగింది. జీవన్‌రెడ్డి విమర్శలు వ్యక్తిగతమని మొదట చెప్పిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఆ తర్వాత మాట మార్చుతూ ఆయన వేదనను పార్టీ అర్థం చేసుకుంటుందని పేర్కొన్నారు. జీవన్‌రెడ్డికి తన మద్దతు ఉంటుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి బహిరంగంగా తెలిపారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ మరో అడుగు ముందుకేసి జగిత్యాలకు వెళ్లి మళ్లీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిశారు. అంతే కాదు, హత్యకు గురైన కాంగ్రెస్ నేత గంగారెడ్డి కుటుంబ సభ్యులను జీవన్‌రెడ్డితో కలిసి మధుయాష్కీ పరామర్శించారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే గంగారెడ్డి హత్య జరిగిందని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ సందర్భంగా విలేకరుల ఎదుట మధుయాష్కీ డిమాండ్ చేశారు.**

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వెంటనే ఫిరాయింపుల నిరోధక చట్టం అమల్లోకి తీసుకొస్తామని ఆ పార్టీ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. కానీ, ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశిస్తూ మధుయాష్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకే ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని ఆయన ఆరోపించారు. స్వప్రయోజనాల కోసమే తప్ప, వారికి కాంగ్రెస్ పార్టీపై ఎలాంటి ప్రేమ, గౌరవం లేదని ఆయన విమర్శించారు.

> **ఎమ్మెల్యేలను పోగొట్టుకున్న బీఆర్ఎస్ పార్టీ పెద్దలు అనవలసిన మాటలు ఒక కాంగ్రెస్ పెద్దమనిషి అనడం విడ్డూరం. వింతేమిటంటే.. ఇప్పటికివరకు మధుయాష్కీ మాటలను కాంగ్రెస్ నేతలెవరూ తప్పుపట్టలేదు, ఖండించలేదు కూడా. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు గాని, వారికి కండువా కప్పి చేర్చుకున్న రేవంత్‌రెడ్డి గాని మధుయాష్కీ అభిప్రాయాన్ని కాదనలేదు.**

ఎమ్మెల్యేలుగా గెలవలేకపోయిన ముగ్గురు సీనియర్ నేతలు జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి, మధుయాష్కీ ఈ రకంగా ఒక్కతాటిపైకి వచ్చారు. మధ్యలో వచ్చినవారు, ఫిరాయింపురాయుళ్లు పార్టీలో పెత్తనం చెలాయిస్తుంటే తాము చూస్తూ ఊరుకోమని ఒక హెచ్చరికను జారీ చేసినట్టుగా వారి వైఖరి ఉంది. దాంతో ఫిరాయింపులను ప్రోత్సహిస్తే కాంగ్రెస్ సీనియర్ల నుంచి మరింత వ్యతిరేకత ఎదురుకావచ్చనే సంశయం కూడా పార్టీలో మొదలైంది. వివిధ కారణాల వల్ల కాంగ్రెస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత, నిరాశను గమనించి ఫిరాయింపులకు వెనుకాడుతున్న నాయకులు కూడా ఉండవచ్చు.

మరోవైపు చూస్తే .. ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన తొలి ముగ్గురు శాసన సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ సభ్యులు కోర్టు మెట్లెక్కారు. నాలుగు వారాల్లోగా చర్యలు తీసుకోనట్టయితే తామే విచారణ చేపట్టవలసి వస్తుందని అసెంబ్లీ కార్యదర్శిని సెప్టెంబర్ 9న హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశించింది. అయితే, దీనిపై అసెంబ్లీ కార్యదర్శి డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా.. ఆ ముగ్గురి సభ్యత్వ రద్దుపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని తెలుపుతూ అక్టోబర్ 4న డివిజనల్ బెంచ్ ఆ కేసును వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో రాజ్యాంగాన్ని పట్టుకొని హంగామా చేసే రాహుల్‌గాంధీ.. తెలంగాణ దిక్కు చూడకపోవడం విడ్డూరం.

అణచివేతపై మేధావుల మౌనం

శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
90309 97371

> **పోయిన డిసెంబర్‌లో తెలంగాణకు కాంగ్రెస్ రూపంలో గ్రహణం పట్టింది. అయితే, దానికంటే ఒకటి రెండేండ్లకు ముందే తెలంగాణ మేధావులు అనబడేవారు కేసీఆర్ పాలన మీద ఉన్నవీ, లేనివీ ప్రచారం చేయడం మొదలైంది.**

'వారికి అధికారం ఇచ్చి, మన మీద అంధకారపు నీడలు పరిచే అవకాశం ఇవ్వడానికి బాధ్యులం మనమే కదా. మన చేతల ద్వారా, చేతలేమి ద్వారా కూడా!'.. రాష్ట్ర పరిస్థితి గురించి చర్చ సందర్భంగా ఓ ఢిల్లీ జర్నలిస్టు అన్న మాటలివీ. కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదనో, పదవులు ఇవ్వలేదనో, ఇంకా ఏవేవో కారణాలతో ఆయన మీద కోపం పెంచుకొని పచ్చగా కళకళలాడుతున్న తెలంగాణపై కాయతొలిచే పురుగుల్లా ఆ మధ్య మేధావి వర్గం విరుచుకుపడ్డది. కాబట్టే, ఈ రోజు వారు రేవంత్ ప్రభుత్వపు అరాచకాలను మౌనంగా భరిస్తున్నరు, పదవుల ఆశకో, బెదిరింపుల భయానికో! నిజానికి వీరిలో ఎందరికో రేవంత్ వ్యక్తిత్వం వశపడుతలేదు. అట్లా అని నోరు తెరిచే పరిస్థితి లేదు. ఎందుకంటే, అవతల ఉన్నది బోళాశంకర చంద్రశేఖర్‌రావు కాదు, తేడా వస్తే అంతుచూసే రేవంత్‌రెడ్డి. ఎవరైనా ఊహించారా ఇంత పతనం? కోదండరాం అనుకున్నారా... హైదరాబాద్‌కు కర్ఫ్యూ రోజులు రాబోతాయని? హరగోపాల్ సంతోషించే విషయమా... హక్కులు అడుగుతున్న పోలీసులను శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తారని? ఆకునూరి మురళి శాంతిస్తారా... ట్యాంక్‌బండ్‌పైన ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అడ్డుగోడ కట్టడాన్ని చూసి? పది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం సర్వభ్రష్టత చెందింది. పదేండ్ల కేసీఆర్ పాలన ప్రతి రోజూ గుర్తుకువస్తున్నది జనానికి. ఇది బీఆర్ఎస్‌కు కరెక్షన్ కాలం అయితే, కాంగ్రెస్‌కు పోయే కాలం! ఎంత గొప్ప నాయకులైనా, ప్రభుత్వాలైనా ప్రజాగ్రహానికి గురవుతాయి. అయితే అందుకు ఐదేండ్లో, పదేండ్లో పడుతుంది. కానీ, నవమాసాలు కూడా నిండకుండానే కాంగ్రెస్ భ్రష్టుపట్టడానికి ఏకైక కారణం రేవంత్‌రెడ్డి. రెండో ఏకైక కారణం రాహుల్‌గాంధీ!

'తెలంగాణ లోగో మార్చడం పిచ్చి ఆలోచన' అని ఆంధ్రజ్యోతి రాధాకృష్ణే అన్నాడే? మరి

రేవంత్‌కు అర్థం కాదా? ఆయనను సహిస్తున్న రాహుల్ గ్రహించలేడా? తన అసమర్థ పాలన, అమానవీయ స్పందన వల్ల ఎంత ప్రజాగ్రహం మూటగట్టుకున్నడో రేవంత్ ఇంటి దగ్గర పెంచిన సెక్యూరిటీయే తార్కాణం! సీఎం గురించి వాట్సాప్ వీడియోలలో బాధిత మహిళలు మాట్లాడుతున్న భాష ఇక్కడ రాయలేం కానీ, వారిది ధర్మాగ్రహం. కాసులు, కేసులకు అలవాటు పడి రాష్ట్రంలో జనాల గోడు పట్టించుకునే మూడ్‌లో లేడు రాహుల్‌గాంధీ! మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల కోసం మూసీ జనాన్ని ముంచో, అదానీని ప్రాధేయపడో డబ్బులు తెమ్మన్న రాహుల్ ఏ మొహం పెట్టుకొని నిలదీయగలడు? ఒకవైపు కాంగ్రెస్ అధిష్ఠానానికి కప్పం కడుతూ, మరోవైపు బీజేపీ అధిష్ఠానంతో టచ్‌లో ఉన్నడు రేవంత్. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రుల ప్రవర్తన ఇదే చెప్తున్నది. హైడ్రా అంశంలో, కొండా సురేఖ విషయంలో ప్రభుత్వంపై కోర్టులు సహా జన బాహుళ్యం దుమ్మెత్తిపోసినా రేవంత్ పట్టించుకోవడం లేదు సరికదా, ఎవరు అడ్డొచ్చినా తాను మారనంటూ పబ్లిక్‌గానే చెప్తున్నడు. విదేశాల్లోనూ, దేశంలోనూ ఫేక్ కంపెనీలు, మోసపు చరిత్ర ఉన్న కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టులు ఇవ్వజూపుతున్నా; రాష్ట్ర బీజేపీ నాయకులు అడపాదడపా విమర్శలకు పరిమితం అవుతున్నరు తప్ప, ఒక్క దానిపై విచారణ కోరడం లేదు, హెచ్చరికా లేదు. మోదీ అనుగ్రహం రేవంత్‌కు పుష్కలంగా ఉన్నదని ఢిల్లీ వర్గాలు బల్లగుద్ది చెప్తున్నాయి.

'కాంగ్రెస్ అంటే నాకెందుకో ఓ మూల కొంత గౌరవం ఉండేది. ఎంత కాదనుకున్నా, చాలా అసంతృప్తి ఉన్నా, కొంత లౌకికవాదం, కొంత సోషలిజం దాంట్లో ఇంకా మిగిలి ఉన్నాయని. కానీ, ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, పార్టీ, నేతలు, ప్రభుత్వాన్ని చూస్తుంటే... అయ్యో ఇది కాదే నా ఆలోచనలో ఉన్న కాంగ్రెస్ అనిపిస్తున్నది. ప్రభుత్వ నిర్వహణ పరంగా బీఆర్ఎస్ చేసిన ప్రత్యేకమైన, తీవ్రమైన తప్పిదాలు కనబడలేదు. కొత్త సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం, రైతుబంధు... ఇలా దాదాపు అన్ని వర్గాలను సంతోషపరిచినట్టే కనబడింది. పేదల పార్టీ అనుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా తన ఇమేజ్‌కు తగ్గ ఒక్క పనీ చేయలేదు. సరికదా పూర్తిగా వ్యతిరేకంగా ప్రవర్తించడం చాలా ఆశ్చర్యకరంగా ఉన్నది. ముఖ్యంగా హైడ్రా పేరుతో అది పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న తీరు, సినీ నటి వ్యవహారంలో ప్రవర్తించిన తీరు చూస్తుంటే అస